

సెలవుపై డిఎల్‌పిఒ ఎఒ వెంకట్రావు

ప్రజాశక్తి-కాకినాడ

కాకినాడ డివిజనల్ పంచాయతీ కార్యాలయంలో ఎఒ జె.వెంకట్రావు కార్యదర్శులపై అసభ్యకరంగా మాట్లాడుతూ వారిని వేధిస్తుండడంతో జిల్లా పంచాయతీ అధికారి ఎఒ వెంకటరావుని పిలిపించి కార్యదర్శులకు క్షమాపణ చెప్పించారు. అనంతరం సెలవుపై వెళ్లాలని సూచించారు. ఈ విషయంపై జిల్లా పంచాయతీ కార్యదర్శుల సంఘం అధ్యక్షులు నరసింహారావు మాట్లాడుతూ పంచాయతీ కార్యదర్శులపై ఎఒ వెంకటరెడ్డి పిజిఆర్‌ఎస్‌లో ఫిర్యాదులు చేయిస్తూ వేధింపులుకు గురి చేస్తున్నట్టు తెలిపారు. దళిత కార్యదర్శులను వేధించడం వెంకట్ రెడ్డికి బాగా అలవాటు అన్నారు. మహిళా కార్యదర్శుల వస్త్రధారణపై కూడా చాలా అవమానకరంగా వెంకట్ రెడ్డి మాట్లాడుతున్నట్టు తెలిపారు.

సమస్యలపై సిపిఎం ప్రజాపోరు

ప్రజా సమస్యల పరిష్కారం కోసం సిపిఎం ఆధ్వర్యంలో ఈ నెల 8వ తేదీ నుంచి చేపట్టిన ప్రజాపోరు క్యాంపెయిన్ ముగింపు సందర్భంగా శుక్రవారం పలుచోట్ల ధర్నాలు ప్రదర్శనలు నిర్వహించరాఉ.

ప్రజాశక్తి-యంత్రాంగం

కాకినాడ స్థానిక జిల్లా కలెక్టర్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సిపిఎం జిల్లా కన్వీనర్ ఎం.రాజశేఖర్, పార్టీ సీనియర్ నేత దువ్వా శేషబాబ్జీ, నగర కమిటీ సభ్యుడు కె.సత్తిరాజు మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం సంపన్నులకు వరాలు కురిపిస్తూ సామాన్యులపై భారాలు మోపుతోందని విమర్శించారు. నిరుద్యోగులకు ఉపాధి కల్పించాలని, కేంద్ర రాష్ట్ర ప్రభుత్వ శాఖల్లో ఖాళీ పోస్టులు భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. దేశంలో మహిళలు, చిన్నారులపై జరుగుతున్న హత్యాచారాలు సభ్య సమాజం తలదించుకునేలా ఉన్నాయన్నారు. త్యాగాలతో సాధించుకున్న విశాఖ ఉక్కు, దేశ ప్రజల కష్టంతో నిర్మించుకున్న ప్రభుత్వ రంగ సంస్థల ప్రైవేటీకరణ ఆపాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం సూపర్ సిక్స్ హామీలు అమలు చేయాలన్నారు. మద్యం పాలసీ దారుణంగా ఉందన్నారు. ప్రజలు అభ్యంతరం తెలిపిన చోట బ్రాందీ షాపులు తొలగించాలన్నారు. ట్రూఅప్ ఛార్జీల పేరుతో ప్రజలపై వేసిన విద్యుత్ భారాలు రద్దు చేయాలని, ప్రి పెయిడ్ స్మార్ట్ మీటర్ల ఏర్పాటు ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. అత్యవసర మందులు, వైద్య పరికరాలపై జిఎస్‌టి. పూర్తిగా తొలగించాలన్నారు. కాకినాడ నగర పాలక సంస్థకు తక్షణమే ఎన్నికలు నిర్వహించాలని, మున్సిపల్ కార్పొరేషన్ కార్మికులకు బకాయి లేకుండా ప్రతినెలా ఒకటో తేదీనే జీతాలు చెల్లించాలన్నారు. ప్రభుత్వ సామాన్య ఆసుపత్రి పడకల స్థాయిని 2500కు పెంచి వైద్య సేవలు మెరుగు పరచాలని కోరారు. ప్రజా సమస్యల పరిష్కారానికై సిపిఎం నిర్వహిస్తున్న ఆందోళనలను ప్రజలు బలపరిచాలన్నారు. ధర్నా అనంతరం జిల్లా రెవెన్యూ అధికారి జె.వెంకట్రావుకు వినతిపత్రం ఇచ్చారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నగర కన్వీనర్ పలివెల వీరబాబు, నగర కమిటీ సభ్యుడు మలకా వెంకట రమణ, సూరిబాబు, మేడిశెట్టి వెంకటరమణ, పాలిక రాజేంద్ర ప్రసాద్, సిహెచ్.రమణి, జి.భూలక్ష్మి, గౌరి, దుర్గ, ఏసూరి శ్రీనివాస్,



కాకినాడ కలెక్టరేట్ వద్ద ధర్నా చేస్తున్న సిపిఎం నాయకులు

చిట్టిబాబు, రాంబాబు, సత్యనారాయణ రెడ్డి, మోహన్ రావు, గంగాధర్, టి.శ్రీనివాస్ పాల్గొన్నారు.

కోటనందూరు విద్యుత్ స్మార్ట్ మీటర్లను అమర్చడం తక్షణమే నిలిపివేయాలని సిపిఎం ఆధ్వర్యాన స్థానిక తహశీల్దారు కార్యాలయం వద్ద ఆందోళన చేపట్టారు. పార్టీ మండల కార్యదర్శి ఎస్‌కె.పద్మ మాట్లాడుతూ సిఎంగా వైఎస్.జగన్ ఉన్నప్పుడు స్మార్ట్ మీటర్లను చంద్రబాబు, పవన్‌కల్యాణ్ వ్యతిరేకించారని గుర్తు చేశారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత రాష్ట్రంలో పలు జిల్లాల్లో ప్రభుత్వ కార్యాలయాలకు ముందుగా ప్రి పెయిడ్ స్మార్ట్ మీటర్లు బిగించారని, ప్రస్తుతం చిన్న, మధ్యతరగతి వ్యవసాయ బోర్లకు, నివాస గృహాలకు మీటర్లు పెట్టడానికి సన్నాహాలు చేస్తున్నారని తెలిపారు. అనంతరం తహశీల్దారు తాడి సుభాష్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో సత్యవతి, బీబీ, అప్పారావు నరస రమణ, పార్వతి తదితరులు పాల్గొన్నారు.

యు.కొత్తపల్లి వాకతిప్ప మాదిగ పేటలో నిర్వహించిన ప్రజా పోరు యాత్రలో గ్రామస్తులు డ్రైనేజీలు, రోడ్లు లేవని తెలిపినట్లు సిపిఎం నాయకులు గుర్రాల అప్పారెడ్డి తెలిపారు 2014లో చంద్రబాబు అధికారంలో ఉండగా వాకతిప్పలో బాణసంచా పేలుల్లో మరణించిన మతుల కుటుంబాలకు ఇస్తామన్న భూములను ఎక్కడున్నాయో నేటికీ చూపలేదని బాధితులు వాపోయారు. ఈ నెల 18న తహశీల్దారు కార్యాలయం వద్ద నిర్వహించే ధర్నాను విజయంతం చేయాలని పిలుపునిచ్చారు ఈ కార్యక్రమంలో కె.నాగేశ్వరరావు, శివకుమార్, చిన్న, అంగర సుబ్రహ్మణ్యం, శ్రీను, సిహెచ్.నారాయణరెడ్డి, డి.బావి, వి.సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

కరప మండలంలోని కరప, రామకంచ నగర్ కాలనీ, వలసపాకల గ్రామాల్లో ప్రజా పోరు కరపత్రాలను ప్రజలకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సిపిఎం కాకినాడ జిల్లా కార్యదర్శి ఎం.రాజశేఖర్ మాట్లాడారు. అధిక ధరలు, నిరుద్యోగం, ఇసుక, మద్యం, కరెంటు ఛార్జీలు, పిల్లలు, మహిళలపై అత్యాచారాలు, విశాఖ ఉక్కు ప్రైవేటీకరణ. జమిలి ఎన్నికలు కేంద్ర రాష్ట్ర ప్రజా వ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా ప్రజా పోరు పేరుతో ఇంటింటా ప్రచారం నిర్వహిస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నాయకులు సిహెచ్.రమణి, గంగాభవాని తదితరులు పాల్గొన్నారు.


కరపలో కరపత్రాలు పంపిణీ చేస్తున్న రాజశేఖర్


యు.కొత్తపల్లిలో వాకతిప్పలో పర్యటిస్తున్న సిపిఎం బృందం


కోటనందూరులో వినతిపత్రం అందజేస్తున్న సిపిఎం నాయకులు

జిల్లాకు వేమగిరి, తీపర్రు రీచ్‌ల కేటాయింపు

ప్రజాశక్తి-కాకినాడ

కాకినాడ జిల్లా ఇసుక అవసరాల నిమిత్తం తూర్పు గోదావరి జిల్లాలోని వేమగిరి, తీపర్రు-3 రీచ్‌లను ప్రభుత్వం కేటాయించిందని ఈ రీచ్ లకు అనుబంధంగా జిల్లాలో కాకినాడ, పెద్దాపురం, గొల్లప్రోలులో ఇసుక స్టాక్ యార్డులను ఏర్పాటు చేశామని జిల్లా కలెక్టర్ షాన్ మోహన్ సగిలి తెలిపారు. శుక్రవారం ఆయన కలెక్టరేట్ పిజిఆర్ఎస్ హాల్లో మీడియా ప్రతినిధుల సమావేశంలో ఇసుక లభ్యతకు చేపట్టిన చర్యలు, ఉపాధ్యాయ, పట్టభద్రుల ఎంఎల్‌సి ఎన్నికల నిర్వహణ ఏర్పాట్లు, చైల్డ్ సేఫ్ కాకినాడ కాంపెయిన్ నిర్వహణ, విద్యార్థుల అపార్ నమోదు అంశాలపై వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో పర్యావరణ అనుమతులతో, నిర్మాణాలకు పనికివచ్చే ఇసుక కలిగిన రీచ్‌లు లేనందున ప్రభుత్వాన్ని కోరినట్టు తెలిపారు. రీచ్ ఆపరేటింగ్ ఏజెన్సీల ఖరారు పూర్తయిందని, స్టాక్ యార్డు నిర్వహణకు ఏజెన్సీల టెండర్లు పిలిచి ఈ నెల 22 నాటికి టెండర్లు తెలిచి లైసెన్సీలను ఖరారు చేస్తారన్నారు. ఆపై రెండు రోజుల్లోపు ఈ నెల 24, 25 తేదీల నాటికి స్టాక్ యార్డులలో ఇసుక వినియోగదారులకు అందుబాటులోకి వస్తుందన్నారు. వినియోగదారులు నేరుగా ఈ రెండు రీచ్‌ల నుండి గాని, స్టాక్ యార్డుల నుండి గాని ఇసుకను పొందవచ్చునన్నారు. నూతన ఇసుక విధానం క్రింద వినియోగదారులు ఇసుకకు వస్తుధర ఏమీ చెల్లించనవసరం లేదని, ఇసుక త్రవ్వకం, రవాణా, నిల్వల నిర్వహణకు అయ్యే ఖర్చులను మాత్రమే చెల్లిస్తే సరిపోతుందన్నారు. టన్ను ఇసుకకు ఈ ఛార్జీలను కాకినాడ, పెద్దాపురం స్టాక్ యార్డు వద్ద రూ.600, గొల్లప్రోలు యార్డ్ వద్ద రూ.582గా నిర్ణయించామన్నారు. ఎంఎల్‌సి నియోజకవర్గ ఓటరుగా నమోదుకు అర్హులైన వారు డిశంబరు 9వ తేదీ వరకూ దరఖాస్తు చేసుకోవచ్చునని కలెక్టర్ తెలిపారు. లైంగిక అకత్యాల నివారణపై ప్రజా చైతన్యాన్ని జాగతం చేసేందుకు జిల్లాలో రానున్న 6 నెలల పాటు చైల్డ్ సేఫ్ కాకినాడ స్పెషల్ కాంపైన్ నిర్వహిస్తున్నామని కలెక్టర్ తెలిపారు. చిన్నారులపై అకృత్యాల నివారణకు 1098, 7331126044 హెల్ప్ లైన్ నంబర్లు ఏర్పాటు చేశామన్నారు. డిఆర్ఒ జె.వెంకటరావు, సమాచార శాఖ డిడి డి.నాగార్జున, అధికారులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ షాన్ మోహన్ సగిలి

సమస్యలపై 104 ఉద్యోగుల వినతి

ప్రజాశక్తి -కరప

తమ సమస్యలు పరిష్కరించాలని 104 ఉద్యోగులు ఉప్పలంక సర్పంచ్ బొమ్మిడి నయోమికి శుక్రవారం వినతిపత్రం అందించారు. కాకినాడ జిల్లా 104 ప్రధాన కార్యదర్శి ఎం.త్రిమూర్తులు మాట్లాడారు. 104 వైద్య సేవలను పిహెచ్‌సి మెడికల్ ఆఫీసర్ ద్వారా వైద్య సేవలు అందించాలని, 3 నెలల వేతన బకాయిలు చెల్లించాలని, 104 సేవలను ప్రభుత్వమే ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ద్వారా కేవలం రూ.50 వేల ఖర్చుతో నిర్వహించి ప్రజా ధనం వథా కాకుండా చూడాలని, 2020 తరువాత విధుల్లో చేరిన డ్రైవర్, డిఇఒకు జిఒ 7 ద్వారా వేతనాలివ్వాలని, అరబిందో యాజమాన్యం అక్రమంగా వసూలు చేసిన పిఎఫ్ తిరిగి చెల్లించాలని, 74 మంది సీనియర్ డ్రైవర్లకు స్లాబ్ అమలు చెయ్యాలని, డిఎస్‌సి ద్వారా నియమితులైన సీనియర్ డ్రైవర్‌లను కాంట్రాక్టులో పెట్టాలని, ఉద్యోగులకు మెడికల్ ఇన్సూరెన్స్ చేయించాలని కోరారు. ఈ కార్యక్రమంలో యూనియన్ ఉపాధ్యక్షురాలు వి.ఇందుమతి ఉద్యోగులు పాల్గొన్నారు.


సర్పంచ్‌కు వినతిపత్రం అందిస్తున్న 104 ఉద్యోగులు

ఎన్‌జిఒ అసోసియేషన్ ఎన్నిక

ప్రజాశక్తి - పెద్దాపురం

పెద్దాపురం తాలూకా ఎన్‌జిఒ అసోసియేషన్ నూతన కమిటీ ఎన్నిక ఏకగ్రీవంగా జరిగింది. స్థానిక పకీర్ బావి వీధిలోని ఎన్‌జిఒ అసోసియేషన్ భవనంలో ఎన్నికల పరిశీలకులు మట్టపర్తి వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో ఈ నూతన కమిటీ ఎంపిక ఏకగ్రీవంగా జరిగింది. అధ్యక్షునిగా సిహెచ్‌వి సత్యనారాయణ, కార్యదర్శిగా రామా, వివిఎస్ఎస్ ప్రమోద్ కుమార్, కోశాధికారిగా పివి శ్రీనివాసరావు, అసోసియేట్ అధ్యక్షునిగా టి.సాయిబాబు, సిహెచ్.ఉమాదేవి, ఉపాధ్య క్షునిగా ఎండి రియావుద్దీన్, ఎస్‌కె వాలీదా షాన్, సహాయ కార్యదర్శులుగా డి.దుర్గారావు, పి.విశాలాక్షి, జి.వీరబాబు, మహిళా సహాయ కార్యద ర్శిగా డి.శ్రీవల్లి ఎంపికయ్యారు. అనంతరం నూతన కమిటీ సభ్యులను అభినందించారు.

ఘనంగా బాలల దినోత్సవం

ప్రజాశక్తి-కాకినాడ రూరల్

వలసపాకల సుందరయ్య కాలనీలో సుందరయ్య చిల్డ్రన్స్ క్లబ్ ఆధ్వర్యంలో శుక్రారం బాలల దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా చేయూత స్వచ్ఛంద సేవా సంస్థ ఎడ్యుకేషన్ వింగ్ కార్యదర్శి కందుకూరి పాల్ రాజు, ఎపిఎస్‌పి హెచ్‌ఎం పి.మధు కుమార్, సిఐటియు కాకినాడ రూరల్ కార్యదర్శి తొట్టిపూడి రాజా మాట్లాడారు. చేయూత స్వచ్ఛంద సేవా సంస్థ సహకారంతో బాలల దినోత్సవం ఘనంగా నిర్వహించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ట్యూషన్ టీచర్ రోజా, నిత్యశ్రీ, మంగ, యేసు, సాయి, తరుణ్, చెర్రీ, కామాక్షి, బాలాజీ, తన్విశ్రీ, భవిత పాల్గొన్నారు.


ఆదిత్యలో సదస్సులో పాల్గొన్న ముఖ్య అతిథులు

ఆదిత్యలో కేర్-2024 సదస్సు ప్రారంభం

ప్రజాశక్తి-గండేపల్లి

సూరంపాలెం ఆదిత్య గ్రూప్ ఆఫ్ ఫార్మసీ కాలేజీలో 'కంప్యూటేషనల్ అడ్వాన్స్‌మెంట్ ఇన్ రీసెర్చ్ అండ్ ఎడ్యుకేషన్ ఫర్ ఫార్మాస్యూటికల్ ఎక్సలెన్స్ (కేర్ 2024)' జాతీయ సదస్సును శుక్రవారం ఘనంగా ప్రారంభించారు. ఈ సదస్సులో ముఖ్య అతిథిగా ఫార్మసీ కౌన్సిల్ ఆఫ్ ఇండియా ప్రెసిడెంట్ డాక్టర్ మొంటు ఎం.పటేల్ వర్చ్యువల్‌గా విద్యార్థులను ఉద్దేశించి కాన్ఫరెన్స్ ప్రాముఖ్యతను తెలిపారు. గెస్ట్ ఆఫ్ హానర్ గా సీనియర్ ప్రిన్సిపల్ సైంటిస్ట్, సెంట్రల్ డ్రగ్ రీసెర్చ్ ఇన్స్టిట్యూట్ డాక్టర్ అనిల్‌కాంత్ గైక్వాడ్ మాట్లాడారు. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ ఆవిష్కరణలను కనుగొనడంలో, వాటిని అభివృద్ధి చేయడానికి, కొత్త పద్ధతులను ఫార్మసీకి వర్తించడంలో, భవిష్యత్తును ఊహించడంలో ఎంతగానో ఉపయోగపడుతుందని తెలిపారు. డాక్టర్ ఎస్.కవిమణి ఎఐ పద్ధతుల ద్వారా నూతన అప్లికేషన్‌ను నెట్వర్క్ ఫార్మకాలజీలో ఏ విధంగా ఉపయోగించవచ్చో తెలిపారు. ఆదిత్య యూనివర్సిటీ డిప్యూటీ ప్రో ఛాన్సలర్ డాక్టర్ ఎం.శ్రీనివాస రెడ్డి, ఆదిత్య కాలేజ్ ఆఫ్ ప్రిన్సిపల్ డాక్టర కె.రవిశంకర్, ప్రిన్సిపల్ డాక్టర్ కె.రవిశంకర్, డాక్టర్ డి.సతీష్ కుమార్ పాల్గొన్నారు.

అపోలోలో గుండె వ్యాధికి అరుదైన చికిత్స

ప్రజాశక్తి-కాకినాడ

కాకినాడ అపోలో ఆసుపత్రి వైద్యులు నూతన వైద్య విధానానికి శ్రీకారం చుట్టారు. ఉభయ గోదావరి జిల్లాల్లో తొలిసారిగా టావి విధానంలో విజయవంతంగా చికిత్స చేశారు. శుక్రవారం విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడించారు. పిఠాపురం మండలం కందరాడ గ్రామానికి చెందిన 74 ఏళ్ల సేనాపతి రాఘవులుకు కొన్నేళ్ల క్రితం చికిత్స నిర్వహించారు. వారం రోజుల క్రితం అతనికి నడుస్తుంటే ఆయాసం రావడంతో వారి కుటుంబ సభ్యులకు చెప్పగా ఆసుపత్రికి చికిత్స కోసం చేర్చారు. ఈ నెల 11న పరీక్షలు నిర్వహించగా గుండె వాల్వుకు రక్తం సరఫరా లేదని వైద్యులు గ్రహించారు. టావి అనే నూతన విధానం ద్వారా గొట్టంతో గుండెకు వాల్వు పంపించే వైద్యాన్ని రాఘవులుకి నిర్వహించారు. కుట్టు కోత లేకుండా శస్త్ర చికిత్స నిర్వహించినట్లు వైద్యులు చెప్పారు. రెండు రోజుల్లోనే రోగి రాఘవులు కోలుకున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో వైద్యులు వెంకటేశ్వరరావు, జి.సార్జిత్ కిషన్, నాగేశ్వరరావు, ఎఒ ఐవి.రమణ, మార్కెటింగ్ హెడ్ ఎన్.అంజిబాబు, అపోలో సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో వివరాలు వెల్లడిస్తున్న వైద్యులు

విద్యారంగ సమస్యలపై 18న మహాధర్నా

ప్రజాశక్తి-కాకినాడ

విద్యారంగ సమస్యలపై ఈ నెల 18న విజయవాడలో మహాధర్నాను జయప్రదం చేయాలని కోరుతూ శుక్రవారం స్థానిక కచ్చేరి పేటలో పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు పి.వరహాలు, ఎం.గంగాసూరిబాబు మాట్లాడారు. విద్యార్థులంతా మహా ధర్నాలో పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. విద్యాదీవెన, వసతిదీవన బకాయిల విడుదలకు ప్రభుత్వం తాత్సారం చేస్తోందన్నారు. అసెంబ్లీ సమావేశాలలో బడ్జెట్‌లో కేటాయింపులలో పెండింగ్ బకాయిల గురించి మాట్లాడకపోవడం అన్యాం అన్నారు. ఫీజులు చెల్లిస్తేనే పరీక్షలకు అనుమతులు ఇస్తామని యజమాన్యాలు విద్యార్థులపై ఒత్తిడి చేస్తున్నాయని తెలిపారు. రాష్ట్రంలో 84 లక్షల మంది విద్యార్థులకు రూ.12,600 కోట్లు కావాల్సి ఉన్నా కానీ రూ.5,387.03 కోట్లే బడ్జెట్‌లో కేటాయించారన్నారు. దీంతో తల్లికి వందనంపై ఉన్న అనుమానాలు పెరిగాయని అన్నారు. జిఒ నెం 77ను అధికారంలోకి వచ్చిన వంద రోజుల్లోనే రద్దు చేస్తామని చెప్పి వాటి ఊసెత్తడం లేదన్నారు. ప్రభుత్వ జూనియర్ కాలేజీల్లో మధ్యాహ్న భోజన పథకాన్ని గత ప్రభుత్వం రద్దు చేసిందని వెంటనే ప్రారంభించేందుకు చర్యలు చేపట్టాలని కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షులు వాసుదేవ్, మణికంఠ, సాహిత్ జిల్లా సహాయ కార్యదర్శిలు సంజాయి, నాయకులు పాల్గొన్నారు.



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ఎస్‌ఎఫ్‌ఐ నాయకులు



దీక్షా శిబిరంలో మాట్లాడుతున్న రాజ్ కుమార్

22వ రోజుకు క్లాప్ డ్రైవర్ల ఆందోళన

ప్రజాశక్తి-కాకినాడ

క్లాప్ వాహన డ్రైవర్లు చేపట్టిన ఆందోళన శుక్రవారం 22వ రోజుకు చేరుకుంది. సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి సిహెచ్.రాజ్ కుమార్ హాజరై మాట్లాడుతూ 22 రోజులైనా జీతాలు వేయకపోవడం అన్యాయమని, అధికారులు తీరు తక్షణమే మార్చుకుని బకాయి జీతాలు వేయించడం కోసం కృషి చేయాలన్నారు. మున్సిపల్ ఆఫీస్ ముందు ఆందోళన చేస్తుంటే మున్సిపల్ కమిషనర్‌కు కనీసం చీమ కుట్టినట్టు కూడా లేకపోవడం ఆందోళనకరమన్నారు. క్లాప్ డ్రైవర్లు పోరాటం ఇంకెన్ని రోజులు కొనసాగించాలో అధికారులు డ్రైవర్లకు తెలియజేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఇస్మాయిల్, సంతోష్, గంగాధర్, శివశంకర్, దుర్గాప్రసాద్, భద్ర, వెంకటేష్, రమణ, శివ, రాజు, సూరిబాబు పాల్గొన్నారు.

ఘనంగా బిర్సా ముండా జయంతి

ప్రజాశక్తి - పెద్దాపురం


స్థానిక జవహర్ నవోదయ విద్యాలయలో శుక్రవారం ట్రైబల్ ఫ్రీడమ్ ఫైటర్ బిర్సా ముండా జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఇన్‌ఛార్జి ప్రిన్సిపల్ సనపల సత్యనారాయణ ఆధ్వర్యంలో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. గురుకువెల్లి పాపారావు అధ్యక్షతన జరిగిన సభలో సత్యనారాయణ మాట్లాడుతూ జార్ఖండ్ ప్రాంతంలో బిర్సా ముండా గిరిజన హక్కుల కోసం, దేశ స్వాతంత్రం కోసం పోరాడి స్వాతంత్ర పోరాట యోధుడిగా ఆదర్శంగా నిలిచారన్నారు. ఈ కార్యక్రమంలో భాస్కరరావు, డి.అప్పారావు, ధనరాజు, కౌన్సిలర్ నగేష్ పాల్గొన్నారు.

విద్యుత్ ఛార్జీలను తక్షణమే తగ్గించాలి

ప్రజాశక్తి-ప్రత్తిపాడు

రాష్ట్ర ప్రభుత్వం పెంచిన విద్యుత్ ఛార్జీలను తక్షణమే తగ్గించాలని వైసిపి నాయకుడు ముదునూరి మురళీ కృష్ణంరాజు డిమాండ్ చేశారు. నిత్యావసర ధరలతో పాటు విద్యుత్ ఛార్జీలు పెంచడంతో ప్రజలు నిరుపేదలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. అనంతరం రాచపల్లి గ్రామానికి చెందిన బత్తిన సుబ్బారావు కుటుంబాన్ని ఆయన పరామర్శించారు. సుబ్బారావు ఇటీవల కాలంలో రోడ్డు ప్రమాదంలో గాయపడటంతో సుబ్బారావుకు రూ.5000 సాయం అందించారు. ఈ కార్యక్రమంలో వైస్ ఎంపిపి బంకు శ్రీను, రామిశెట్టి బుల్లి రామకృష్ణ, బొల్లు నాగేశ్వరరావు, మాగాపు శివ పాల్గొన్నారు.

కార్టూ'నిజం'



ఘనంగా జాతీయ గ్రంథాలయ వారోత్సవాలు

ప్రజాశక్తి-యంత్రాంగం

కాకినాడ స్థానిక సామర్లకోట రోడ్డులోని ఐడియల్ డిగ్రీ కళాశాలలో సెక్రటరీ కరస్పాండెంట్ డాక్టర్ పి.చిరంజీవినీ కుమారి ఆదేశాలతో అకడమిక్ డైరక్టర్ ఎం.రంజిత్ అధ్వర్యంలో 57వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాలు శుక్రవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. పుస్తక ప్రదర్శనను ప్రిన్సిపల్ డాక్టర్ టి.సత్యనారాయణ ప్రారంభించారు. చింతపల్లి సుబ్బారావు మాట్లాడుతూ ఒక మంచి పుస్తకాన్ని ఎంపిక చేసుకొని నెలకొక పుస్తకం అధ్యయనం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ జి.స్టీవెన్ రాజు, వి.నాగేశ్వరరావు, పి.గోపి, యు.నానిబాబు, మహమ్మద్ ఆలీ, బాల సుబ్రహ్మణ్యం, గోపాలకష్ణ యాదవ్, పి.చలపతి, మాకినీడి సూర్య భాస్కర్, అసిస్టెంట్ లైబ్రేరియన్ వి.నాగలక్ష్మి, లైబ్రేరియన్ ఎస్.దుర్గారావు పాల్గొన్నారు.

పెద్దాపురం విద్యార్థి దశ నుండి పుస్తకాలు చదవటం అలవర్చుకోవాలని డివిజనల్ విద్యాశాఖాధికారి ఈ ప్రభాకర శర్మ అన్నారు. స్థానిక శాఖా గ్రంథాలయంలో పుస్తక ప్రదర్శనను ఆయన ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ గ్రంథాలయాల్లో ఉన్న సాహిత్యం, మహానుభావుల జీవిత చరిత్రలు, ఇతర పుస్తకాలతో పాటు పోటీ పరీక్షలకు అవసరమయ్యే పుస్తకాలన్నీ ఉన్నాయన్నారు. వీటిని సద్వినియోగం చేసుకోవడం ద్వారా ప్రతి విద్యార్థి తన భవిష్యత్తును తీర్చిదిద్దుకోవాలన్నారు. సాహితీ స్రవంతి జిల్లా అధ్యక్షులు డాక్టర్ జోస్యుల కృష్ణబాబు తాను రచించిన 'పెద్దాపురం సాయితీ మూర్తులు' పుస్తకాన్ని ప్రభాకర్ శర్మకు అందజేశారు. ఈ కార్యక్రమంలో గ్రంథాలయాధికారి పాలంకి నాగరాజు, ఎన్.గోపాలకృష్ణ, బుల్లయ్య, మరియమ్మ, అరవింద్, రాజేష్, మనోహర్, జయరాం, రామారావు, వీరబాబు తదితరులు పాల్గొన్నారు.

పిఠాపురం విద్యార్థులు పుస్తక పాఠనాన్ని అలవాటుగా చేసుకోవాలని ప్రభుత్వ డిగ్రీ కళాశాల కామర్స్ అధ్యాపకురాలు ఎ.శ్యామలాదేవి అన్నారు. 57వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా రెండో రోజు స్థానిక శాఖా గ్రంథాలయంలో పుస్తక ప్రదర్శనను ఆమె ప్రారభించి మాట్లాడారు. విద్యార్థుల్లో సృజనాత్మక శక్తిని వెలికితీయడానికి గ్రంథాలయాలు ఎంతో దోహద పడతాయని, పుస్తకం చదవడం ద్వారా సంపాదించిన జ్ఞానాన్ని ఎప్పటికీ మరువలేమన్నారు. ఈ కార్యక్రమంలో గ్రంథాలయ అధికారి ఆర్.వెంకటరాము, వి.సత్యప్రియ, వివిధ పాఠశాల విద్యార్థులు గ్రంథాలయ పాఠకులు పాల్గొన్నారు.

కరప పుస్తక పఠనంతో వ్యక్తిగత వికాసంతో పాటు విజ్ఞానం నైపుణ్యత పెంపొందించుకోవచ్చని కరప హైస్కూల్ హెచ్‌ఎం ఎం. శ్రీనివాసరావు అన్నారు. కరప, వేళంగి శాఖా గ్రంథాలయంలో పుస్తక ప్రదర్శన చేపట్టారు. ఈ కార్యక్రమంలో పీడీ పడాల గంగాధర్ రెడ్డి, లైబ్రేరియన్‌లు పివి.రంగయ్య, ఫణీంద్ర కుమార్ విద్యార్థులు పాల్గొన్నారు.


పిఠాపురంలో ప్రదర్శనను తిలకిస్తున్న విద్యార్థులు



కాకినాడలో విద్యార్థులకు వివరిస్తున్న ప్రిన్సిపల్ బృందం


కరపలో పుస్తకాలను పరిశీలిస్తున్న విద్యార్థులు

తూర్పు కాపు డైరెక్టర్‌గా పెదకాపు

ప్రజాశక్తి - పెద్దాపురం

తూర్పు కాపు కార్పొరేషన్ డైరెక్టర్‌గా పెద్దాపురం బంగారమ్మ గుడి వీధికి చెందిన మాజీ మున్సిపల్ కౌన్సిలర్ గడ్డం పెదకాపు నియమితులయ్యారు. ఈ మేరకు ప్రభుత్వం నుంచి ఉత్తర్వులు వచ్చాయి. ఈ సందర్భంగా పెద్దకాపు మాట్లాడుతూ తన సేవలను గుర్తించి తనను డైరెక్టర్‌గా నియమించినందుకు ముఖ్యమంత్రి చంద్రబాబు, ఎంఎల్‌ఎ నిమ్మకాయల చినరాజప్పకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు.


గడ్డం పెదకాపు

నేరాలు ఘోరాలు

సొసైటీ ఉద్యోగి అదృశ్యంపై కేసు

ప్రజాశక్తి-కోటనందూరు

అప్పలరాజుపేటకు చెందిన బంగారు వీర వెంకట సత్యనారాయణ వ్యవసాయ పరపతి సహకార కోపరేటివ్ సొసైటీలో పని చేస్తున్నారు. ఈ నెల 12 రోజువారీలాగే ఇంటి నుంచి బైకుపై బయటకు వెళ్లారు. ఆ రోజు నుంచీ ఇంటికి రాకపోవడంతో ఆందోళన చెందిన కుటుంబ సభ్యులు, భార్య, బంధువులు స్నేహితులు వారి ప్రాంతాల్లో వెతికినప్పటికీ కనిపించ లేదు. దీంతో శుక్రవారం స్థానిక పోలీస్ స్టేషన్లో ఆయన భార్య ఫిర్యాదు చేశారు. మిస్సింగ్ కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ టి.రామకృష్ణ తెలిపారు.

మద్యం సీసాలు స్వాధీనం ఇద్దరు అరెస్టు

ప్రజాశక్తి - పెద్దాపురం

జె.తిమ్మాపురం, గుడివాడ గ్రామాల్లో శుక్రవారం నిర్వహించిన దాడుల్లో 14 మద్యం సీసాలు స్వాధీనం చేసుకుని ఇద్దరిని అరెస్టు చేసినట్లు ఎక్సైజ్ సిఐ కెవివిడి.అర్జునరావు తెలిపారు. ఈ దాడుల్లో ఎక్సైజ్ ఎస్ఐ పి.చిట్టిబాబు, ఎక్సైజ్ సిబ్బంది పాల్గొన్నారు.

డ్రంక్ అండ్ డ్రైవ్‌లో ముగ్గురికి జరిమానా

ప్రజాశక్తి - జగ్గంపేట

జగ్గంపేట, గండేపల్లి మండలాల్లో శుక్రవారం స్థానిక సిఐ వైఆర్కె.శ్రీనివాస్ ఆధ్వర్యంలో నిర్వహించిన డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీల్లో ముగ్గురికి జరిమానా విధించినట్లు సిఐ తెలిపారు. ఈ తనిఖీల్లో ముగ్గురికి రూ.10 వేల చొప్పున 30 వేల జరిమానా విధించగా ఒకరికి 3 రోజుల జైలు, ఒకరికి రెండు రోజుల జైలు శిక్ష పెద్దాపురం కోర్టు విధించినట్లు ఆయన తెలిపారు. బహిరంగ ప్రదేశాల్లో మద్యం తాగితే కఠిన చర్యలు తప్పవని సిఐ హెచ్చరించారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

ప్రజాశక్తి-జగ్గంపేట

రోడ్డు ప్రమాదంలో ఒక వ్యక్తి మృతి చెందిన సంఘటన శుక్రవారం జగ్గంపేటలో చోటుచేసుకుంది. స్థానికుల తెలిపిన వివరాల ప్రకారం జగ్గంపేటకు చెందిన చోడసాని వెంకట రామస్వామి (35) తన వ్యాపారం ముగించుకుని ఇంటికి వెళ్లే సమయంలో పుష్కరకాలవ వద్ద వెనకనుంచి లారీ ఢీకొంది. స్థానికులు ఆసుపత్రికి తీసుకెళుతుండగా మార్గం మధ్యలో మృతి చెందినట్టు తెలిపారు.

పాదగయలో కార్తీక పౌర్ణమి పూజలు

ప్రజాశక్తి-పిఠాపురం

కార్తీక పౌర్ణమి సందర్భంగా పిఠాపురం పాదగయ క్షేత్రానికి యాత్రికుల రద్దీ పెరిగింది. శుక్రవారం వేకువజాము నుంచే యాత్రికులు కుటుంబ సమేతంగా ఆలయానికి చేరుకుని పుష్కరణలో స్నానాలు ఆచరించి దీపాలు వెలిగించి పుష్కరణలో వదిలారు. కుక్కుటేశ్వర స్వామికి ప్రత్యేక అభిషేకాలు, పురుహూతిక, రాజరాజేశ్వరి అమ్మవార్లకు, దత్తాత్రేయ స్వామికి పూజలు నిర్వహించారు. ఆలయ ఈఓ కె.జగన్మోహన్ శ్రీనివాస్, సూపరిటెండెంట్ వీరభద్రరావు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

తూర్పు కాపు కార్పొరేషన్ డైరెక్టర్‌గా నారాయణ స్వామి

ప్రజాశక్తి-ఏలేశ్వరం


నారాయణస్వామి

రాష్ట్ర తూర్పు కాపు కార్పొరేషన్ డైరెక్టర్‌గా 14వ వార్డు కౌన్సిలర్ మూది నారాయణస్వామి నియమితు లయ్యారు. డైరెక్టర్‌గా మూది నారాయణస్వామి నియమితులు కావడం పట్ల పలువురు హర్షం వ్యక్తం చేస్తున్నారు. తూర్పు గోదావరి సంక్షేమం సంఘం నియోజకవర్గ అధ్యక్షుడిగా కొనసాగుతున్న నారాయణస్వామి గత ఎన్నికల్లో వరుపుల సత్యప్రభ, తంగెళ్ల శ్రీనివాస్ విజయానికి శక్తివంచన లేకుండా కృషి చేశారు. నారాయణస్వామికి పదవి లభించడం పట్ల ఎంఎల్ఎ సత్యప్రభ, టిడిపి నాయకులు బొదిరెడ్డి గోపాలకృష్ణ, గొల్లపల్లి బుజ్జి, కౌన్సిలర్లు ఎంపీటీసీలు అభినందనలు తెలిపారు.

కుక్కుటేశ్వర స్వామికి పట్టు వస్త్రాల సమర్పణ

ప్రజాశక్తి-పిఠాపురం

ఉప ముఖ్యమంత్రి కొణిదెల పవన్ కళ్యాణ్ తరపున పిఠాపురం జనసేన పార్టీ ఇన్‌ఛార్జి మర్రెడ్డి శ్రీనివాస్ శుక్రవారం శ్రీ ఉమా కుక్కుటేశ్వర స్వామి దేవస్థానంలో స్వామి వారికి, అమ్మవారికి పట్టు వస్త్రాలు అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడు రాబోయే రోజుల్లో రాష్ట్రం అన్ని రంగాల్లో ప్రగతి పథంలో ముందుకు సాగాలని, రాష్ట్ర ప్రజలందరి జీవితాల్లో సుఖసంతోషాలు వెల్లివిరియాలని ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ తరపున కుక్కుటేశ్వర స్వామి, అమ్మవార్ల దీవెనలను కోరుకున్నట్లు శ్రీనివాస్ తెలిపారు.


ఆలయంలో పోటెత్తిన యాత్రికులు

భీమేశ్వరాలయానికి యాత్రికుల తాకిడి

ప్రజాశక్తి - సామర్లకోట

కార్తీక పౌర్ణమి సందర్భంగా శుక్రవారం యాత్రికులు అధిక సంఖ్యలో తరలి రావడంతో సామర్లకోట కుమార రామ భీమేశ్వరాలయం కిటకిట లాడింది. శుక్రవారం తెల్లవారుజామునే యాత్రికులు అధిక సంఖ్యలో తరలివచ్చి క్యూ లైన్లలో వేచివుండి భీమేశ్వర స్వామిని, అమ్మవారిని దర్శించుకున్నారు. తొలి అభిషేక పూజలు స్వామివారికి చేపట్టిన సమయానికే వేలకొలదిగా తరలి వచ్చారు. ఆలయ అన్నదాన ట్రస్ట్ ఆధ్వర్యంలో వేలాదిమందికి అన్నదానం చేపట్టారు. కాగా పంచారామ యాత్ర బస్సులు అధిక సంఖ్యలో ఆలయానికి చేరుకోగా సుదూర ప్రాంతాలనుంచి వచ్చిన యాత్రికులకు ఇబ్బందులు కలగకుండా ఆలయ అధికారి బళ్ల నీలకంఠం ఆధ్వర్యంలో ప్రత్యేక ఏర్పాట్లు చేపట్టారు.

యానాం వార్తలు


వేడుకల్లో పాల్గొన్న విద్యార్థులు, తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు

యానాంలో ఘనంగా బాలల దినోత్సవం

ప్రజాశక్తి - యానాం

విద్యాశాఖ, సాంఘిక సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో స్థానిక చిల్డ్రన్స్ ఆడిటోరియంలో చిల్డ్రన్స్ డే వేడుకలు గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పుదిచ్చేరి ప్రభుత్వ ఢిల్లీ ప్రత్యేక ప్రతినిధి మల్లాడి కృష్ణారావు పాల్గొన్నారు. నెహ్రూ చిత్రపటానికి పూలమాలలు వేసి, జ్యోతి ప్రజ్వలన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. విద్యార్థులు విద్యతో పాటు క్రమశిక్షణ కూడా నేర్చుకుంటేనే ఉన్నత స్థానానికి ఎదుగుతారని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆర్ఎఒ మునిస్వామి, విద్యాశాఖ అధికారి పంపన లక్ష్మణ ప్రవీణ్, మున్సిపల్ కమిషనర్ ఖండవల్లి రామకృష్ణ, ఎడిపిసి కమిడి ప్రభాకర రావు, సోషల్ వెల్ఫేర్ అధికారి రెయ్యి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

ప్రైవేట్ పాఠశాలల్లో చిల్డ్రన్స్ డే వేడుకలు

చిల్డ్రన్స్ డే సందర్భంగా పలు ప్రైవేట్ పాఠశాలల్లో వేడుకలు ఘనంగా నిర్వహించారు. స్థానిక రీజెన్సీ పబ్లిక్ స్కూల్లో ఆటల పోటీలు, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. హెచ్ఎం ప్రసాదరావు ఆధ్వర్యంలో బహుమతులు ప్రదానం చేశారు. యానాం చైల్డ్ లైన్ మానసిక వికలాంగుల పాఠశాలలో వేడుకలు నిర్వహించారు.

రొయ్యల చెరువుల రైతులకు సబ్సిడీ

ప్రజాశక్తి - యానాం

పుదుచ్చేరి ప్రభుత్వం ద్వారా నియోజకవర్గంలో ఉప్పునీటి రొయ్యల చెరువుల రైతులకు 2024-25 సంవత్సరానికి సంబంధించి ఇన్పుట్ సబ్సిడీ కోసం దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు మత్స్యశాఖ అధికారి డి.గొంతియ్య శుక్రవారం ప్రకటనలో తెలిపారు. ఒక ఎకరానికి రూ.10 వేలు చొప్పున మూడు ఎకరాలకు సబ్సిడీ ఇవ్వనున్నట్లు తెలిపారు. ఈ పథకం కేవలం కోస్టల్ ఆక్వాకల్చర్ అథారిటీలో రిజిస్ట్రేషన్ చేయించుకున్న వారికి మాత్రమే వర్తిస్తుందని తెలిపారు. ఉప్పునీటి రొయ్యల చెరువుల రైతులందరూ మత్స్యశాఖను శాఖను సంప్రదించాలన్నారు. దరఖాస్తులకు డిసెంబర్ 15 ఆఖరి తేదీ అన్నారు.

ఘనంగా బిర్సా ముండా జయంతి

ప్రజాశక్తి - యానాం



ఐటిఐలో మొక్కలు నాటుతున్న విద్యార్థులు

భారత ప్రభుత్వం యువజన వ్యవహారాలు, క్రీడా మంత్రిత్వ శాఖ నెహ్రూ యువ కేంద్ర ఆధ్వర్యంలో బిర్సా ముండా జయంతిని పురస్కరించుకొని జాతీయ గౌరవ దివస్ కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక సుభాష్ చంద్రబోస్ ప్రభుత్వ ఐటిఐ కళాశాలలో విద్యార్థులు మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో ఐటిఐ ప్రిన్సిపల్ చింతపల్లి కృష్ణ సుధాకర్, జిల్లా యువజన అధికారి తిర్రి గోపి, ఎన్ఎస్ఎస్, ఎన్‌వైకెఎస్ వాలంటీర్లు పాల్గొన్నారు.

యానాంలో కో-ఆపరేటివ్ రిజిస్ట్రార్ పర్యటన

ప్రజాశక్తి - యానాం



పరిపాలనాధికారిని సత్కరిస్తున్న యశ్వంతయ్య

పుదుచ్చేరి కో-ఆపరేటివ్ రిజిస్ట్రార్ యశ్వంతయ్య యానాం పర్యటనలో భాగంగా ది కోపరేటివ్ స్టోర్స్‌ను శుక్రవారం సందర్శించారు. ఈ సందర్భంగా కో-ఆపరేటివ్ స్టోర్స్ అధికారులతో పలు అంశాలు చర్చించారు. ముందుగా స్టోర్స్ అధికారులు, డైరెక్టర్లు ఆయనను ఘనంగా సత్కరించారు. ప్రాంతీయ పరిపాలనాధికారి ఆర్ మునిస్వామిని రిజిస్ట్రార్ యశ్వంతయ్య మర్యాదపూర్వకంగా కలిసి సత్కరించారు.


కేక్ కట్ చేసి సంబరాలు చేస్తున్న నాయకులు

గాడిమొగలో టిడిపి సంబరాలు

ప్రజాశక్తి- తాళ్లరేవు

ఎపి శాసనసభ విప్‌గా ముమ్మిడివరం ఎంఎల్ఎ దాట్ల సుబ్బరాజును నియమించడం పట్ల గాడిమొగలో టిడిపి నాయకులు సంబరాలు నిర్వహించారు. సంగాడి కామేశ్వరరావు అధ్యక్షతన కేక్ కట్ చేసి అందరికీ పంపిణీ చేశారు. మాజీ జెడ్‌పిటిసి పెసింగి ఈశ్వరరావు, మల్లాడి వరదరాజు, కామేశ్వరరావు మాట్లాడారు. ఎంఎల్ఎ దాట్ల సుబ్బరాజు విలువలతో కూడిన రాజకీయం వల్ల రెండోసారి ఎంఎల్ఎగా గెలుపొందారని, ముఖ్యమంత్రి చంద్రబాబు ఆయన ప్రతిభను గుర్తించి విప్‌గా అవకాశం కల్పించారని అన్నారు. ఈ కార్యక్రమంలో లంకే నూకరాజు, అంగాడి తాతారావు, మల్లాడి సీతారామరాజు, పెసింగి నాగబాబు, రేకాడి రామారావు, సంగాడి అన్నవరం, బుజ్జి పాల్గొన్నారు.

ఉత్సాహంగా సత్యదేవుని గిరి ప్రదక్షిణ

ప్రజాశక్తి-శంఖవరం


గిరిప్రదక్షిణలో పాల్గొన్న యాత్రికులు

కార్తీక పౌర్ణమి పురస్కరించుకుని అన్నవరం సత్యదేవుని గిరి ప్రదక్షిణ శుక్రవారం ఉల్లాసంగా సాగింది. అనంతరం కొండ దిగువ గుడిమెట్ల వద్ద దేవస్థానం ఇఒ కె.రామచంద్ర మోహన్, చైర్మన్ ఐవి రోహిత్ టెంకాయ కొట్టి ఆరంభించారు. అక్కడి నుంచి రత్నగిరి కొండ చుట్టూ 13 కిలోమీటర్లు ప్రదక్షిణ చేస్తూ మరలా గుడి వద్దకు చేరుకున్నారు. ఈ సందర్భంగా అధికారులు ప్రదక్షిణం దారి పొడవునా పాలు పండ్లు మంచినీరు ప్రసాదం వితరణ చేశారు. మధ్య మధ్యలో సేద తీరేందుకు మౌలిక సదుపాయాలు కల్పించారు.

ఆరోగ్య కేంద్రంలో టాస్క్‌ఫోర్స్ తనిఖీలు

గొల్లప్రోలు : గొల్లప్రోలు పట్టణ ఆరోగ్య కేంద్రాన్ని జిల్లా టాస్క్ ఫోర్స్ కమిటీ శుక్రవారం తనిఖీ చేసింది. ఈ సందర్భంగా జిల్లా టాస్క్ ఫోర్స్ కమిటీ ప్రోగ్రాం అధికారి బి.విజయలక్ష్మి మాట్లాడుతూ వెల్‌నెస్ సెంటర్ పనితీరు మెరుగు పర్చుకోవాలని, రికార్డును ఎప్పటికప్పుడు తప్పనిసరిగా పూర్తి చేయాలని రిపోర్టులను త్వరితగతన నివేదించాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో డిపిఒమ ఎన్‌హెచ్ ఎంజి.మహేశ్వరరావు, బి.సతీష్ ఆసుపత్రి వైద్యులు ఎస్.రామ్ కుమార్ పాల్గొన్నారు.

ప్రకృతిని కాపాడుకోవాలి : ఉమర్ ఆలీషా

ప్రజాశక్తి-పిఠాపురం


కుట్టు మిషన్లు అందజేస్తున్న పీఠాధిపతి ఉమర్ ఆలీషా

ప్రకతిని కాపాడుకోకపోతే మానవ మనగడే ప్రశ్నార్థం అవుతుందని శ్రీ విశ్వ విజ్ఞాన విద్య ఆధ్యాత్మిక పీఠాధిపతి డాక్టర్ ఉమర్ ఆలీషా అన్నారు. కార్తీక పౌర్ణమి సందర్భంగా శుక్రవారం పీఠం నూతన ఆశ్రమ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన సభలో ఆలీషా ప్రసంగించారు. మానవుడు మేధాశక్తి ద్వారా పొందిన జ్ఞానాన్ని సర్వ మానవ సౌభాతత్వం కోసం వినియోగించాలన్నారు. కొంతమంది వ్యక్తులు స్వార్ధ పూరితమైన ఆలోచనలతో ఇష్టానుసారం చెట్లను నరికివేయడం వల్ల పర్యావరణంలో సమతుల్యత దెబ్బతిని వాతావరణంలో తీవ్ర పరిణామాలు సంభవిస్తున్నాయని తెలిపారు. ప్రకతిని కాపాడుకోకపోతే మానవ మనుగడే ప్రశ్నార్ధకం అవుతుందన్నారు. అనంతరం గీతావధాని యర్రంశెట్టి ఉమామహేశ్వరరావు, పీఠం కేంద్ర కార్యవర్గ సభ్యుడు ఎన్‌టివి.వర్మలు మానవుని జీవితంలో జరిగే పరిణామ క్రియలను గురించి సభకు వివరించారు. అనంతరం ఉమర్ ఆలీషా రూరల్ డెవలప్మెంట్ ట్రస్ట్ తరపున నిరుపేదలకు కుట్టుమిషన్లు, పక్షుల ఆహారం కోసం ధాన్యపు కుచ్చులను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో పీఠం కన్వీనర్ పేరూరి సూరిబాబు, మీడియా కన్వీనర్ ఆకుల రవితేజ, పీఠం సెంట్రల్ కమిటీ సభ్యులు ఎవివి.సత్యనారాయణ, పింగళి ఆనంద్ తదితరులు పాల్గొన్నారు.

హౌసింగ్ బిల్లుల బకాయిలపై సర్వే

ప్రజాశక్తి - పెద్దాపురం


హౌసింగ్ బిల్లుల బకాయిలపై సర్వే చేస్తున్న అధికారులు

గుడివాడ గ్రామంలో గత 10 ఏళ్లలో హౌసింగ్ శాఖ పథకాల ద్వారా గృహాలు నిర్మించుకున్నా ఇప్పటివరకు బిల్లులు మంజూరు కాని గృహాల గుర్తింపునకు గురువారం గ్రామంలో సర్వే చేపట్టారు. ఇటీవల ఎంఎల్ఎ నిమ్మకాయల చినరాజప్ప ఆ గ్రామాన్ని సందర్శించినప్పుడు ప్రజలు తాము గృహ నిర్మాణ సంస్థ ఆమోదం మేరకు ఇల్లు నిర్మించుకున్నప్పటికీ ఆ ఇంటి తాలూకు బిల్లులు మంజూరు కాలేదని ఆయన దృష్టికి తీసుకువెళ్లారు. దీనిపై ఎంఎల్ఎ చినరాజప్ప స్పందించి సర్వే జరపాలని అధికారులను ఆదేశించారు. ఈ మేరకు గృహ నిర్మాణ శాఖ ఎఇ అత్తిలి ప్రసాద్ ఆధ్వర్యంలో గురువారం గ్రామంలో సర్వే చేపట్టారు. సుమారు 78 గృహాల వరకూ బిల్లులు మంజూరు కావాల్సి ఉందని ఆ గ్రామానికి చెందిన టిడిపి నాయకుడు చాగంటి గోపాలకృష్ణ తెలిపారు. గత పదేళ్ల నుండి ఇప్పటి వరకు ఇల్లు నిర్మించుకున్న ఎందరో బిల్లులు మంజూరు కాక అవస్థలు పడుతున్నారన్నారు. ఈ సర్వే ద్వారా అందరికీ బిల్లులు మంజూరు అవుతాయన్నారు. ఈ సర్వేలో వర్క్ ఇన్స్పెక్టర్ శంకరుడు పాల్గొన్నారు.

మిడ్డే మీల్స్ వర్కర్లపై వేధింపులు ఆపాలి

ప్రజాశక్తి-ప్రత్తిపాడు

ప్రభుత్వ పాఠశాలలో మధ్యాహ్న భోజన పథక కార్మికులకు కనీస వేతనాలు ఇవ్వాలని సిఐటియు మండల ప్రధాన కార్యదర్శి రొంగల ఈశ్వరరావు డిమాండ్ చేశారు. మండల విద్యాశాఖ కార్యాలయం వద్ద కార్మికులు శుక్రవారం ధర్నా నిర్వహించారు. యూనియన్ మండల అధ్యక్షురాలు అధ్యక్షురాలు సిహెచ్.వరలక్ష్మి, ఈశ్వరరావు మాట్లాడుతూ మధ్యాహ్న భోజన పథకం కార్మికులకు ఏళ్ల తరబడి పని చేస్తున్నా కనీస వేతనాలు ఇవ్వడం లేదన్నారు. విద్యార్థులకు వంటలు చేస్తునాన సరిపడా బిల్లులు ఇవ్వడం లేదని, ఇచ్చినా సమయానికి ఇవ్వడం లేదన్నారు. రెండు నెలలుగా బిల్లులు, జీతాలు పడకపోవడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నట్టు తెలిపారు. సమస్యలు పరిష్కరించాలని నవంబర్ 22 జరుగుతున్న చలో కలెక్టరేట్‌కు మండలంలో ఉన్న కార్మికులు పెద్ద ఎత్తున తరలి రావాలన్నారు. అనంతరం ఎంఇఒ రాజబాబుకి వినపత్రం ఇచ్చారు. ఈ కార్యక్రమంలో సిహెచ్.నాగసత్య, అనంతలక్ష్మి, సింగర్ లక్ష్మి, నాగలక్ష్మి, అర్జామణి, సుబ్బలక్ష్మి, సత్యవతి, బేబీ, కాంతం పాల్గొన్నారు.

ఇళ్ల పట్టాలివ్వాలని నిరసన

ప్రజాశక్తి - పెద్దాపురం

పెద్దాపురం మున్సిపాలిటీ పరిధిలోని పులిమేరు దమ్ము పేటలో నివసిస్తున్న వారందరికీ ఇళ్ల పట్టాలు ఇవ్వాలని రైతు కూలీ సంఘం డిమాండ్ చేసింది. శుక్రవారం గ్రామంలో నిర్వహించిన అమరవీరుల సంస్మరణ సభలో రైతు కూలీ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కర్నాకుల వీరాంజనేయులు మాట్లాడుతూ అనేక సంవత్సరాలుగా పేదలు దమ్ము పేటలో నివసిస్తున్నారన్నారు. వీరందరికీ ఇళ్ల పట్టాలు ఇచ్చి ఈ కాలనీలో మౌలిక వసతులు కల్పించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో కుంచే అంజిబాబు, వల్లూరి రాజబాబు, డి.సురేష్, బీడీలు నాగేశ్వరరావు, తోట వీరబాబు, అప్పల నరస, చిన్న వెంకటలక్ష్మి, పలివెల సత్తిబాబు పాల్గొన్నారు.


సభ్యత్వ నమోదును పరిశీలిస్తున్న వెంకటరమణ

టిడిపి సభ్యత్వ నమోదు పరిశీలన

ప్రజాశక్తి- సామర్లకోట

టిడిపి సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని పార్టీ పరిశీలకులు బొల్ల వెంకట రమణ శుక్రవారం పరిశీలించారు. స్థానిక ఒకటో వార్డులో సభ్యత్వ నమోదును ఆయన పరిశీలించారు. వేగవంతంగా నమోదు చేపడుతున్న పార్టీ నాయకులను ఈ సందర్భంగా ఆయన అభినందించారు. భీమేశ్వరాలయ ట్రస్ట్ బోర్డ్ చైర్మన్, రైతు సంఘం అధ్యక్షులు కంటే జగదీష్ మోహన్, పార్టీ పట్టణ కార్యదర్శి బడుగు శ్రీకాంత్, యమహా వాసు, రవి తదితరులు పాల్గొన్నారు.

సిఎం చంద్రబాబుకు ఎంఎల్ఎ జ్యోతుల కృతజ్ఞతలు

జగ్గంపేట : టిటిడి బోర్డు మెంబర్‌గా అవకాశం కల్పించిన ముఖ్యమంత్రి చంద్రబాబుకు ఎంఎల్ఎ, టిటిడి బోర్డు సభ్యుడు జ్యోతుల నెహ్రూ కృతజ్ఞతలు తెలిపారు. శుక్రవారం చంద్రబాబును కలిసి మెమెంటో, తిరుపతి లడ్డూ ప్రసాదం అందజేశారు. ఎంఎల్ఎ జ్యోతుల నెహ్రూ మాట్లాడుతూ 74 ఏళ్ల వయసులో వెంకటేశ్వర స్వామి సేవ చేసుకునే భాగ్యాన్ని కల్పించిన చంద్రబాబుకు కృతజ్ఞతలు తెలిపారు. చంద్రబాబుతో గత 40 సంవత్సరాలుగా తనకున్న అనుబంధాన్ని చిత్ర రూపంగా ఫోటో ఫ్రేమ్‌లో అందించామని తెలిపారు.

ఆలయంలో అన్నదానం

ప్రజాశక్తి-పెద్దాపురం

స్థానిక మరిడమ్మ ఆలయంలో కరోనా వల్ల నిలిపివేసిన అన్నదాన కార్యక్రమాన్ని శుక్రవారం పౌర్ణమి సందర్భంగా ఆలయ అనువంశిక ధర్మకర్త డాక్టర్ చింతపల్లి బ్రహ్మాజీ, ఆలయ అసిస్టెంట్ కమిషనర్ కె.విజయలక్ష్మి ప్రారంభించారు. అనంతరం వారు మాట్లాడుతూ ప్రతి ఆదివారం ఆలయంలో నిర్వహించే ఈ అన్నదాన కార్యక్రమాన్ని కరోనా కాలంలో నిలిపివేశామన్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఆసాదులు, అర్చకులు, వేద పండితులు, రంధి సత్యనారాయణ, తూతిక రాజు, పాలకుర్తి సతీష్, సక్కు, పిల్లా పెదకాపు, నాని, అల్లు ప్రసాద్, చంద్రముఖి పాల్గొన్నారు.